ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో

శ్రీశ్రీ 113వ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-విశాఖ: అమర కళాకారుల శతజయంతి, మహాకవి శ్రీశ్రీ 113వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏపి ప్రజానాట్యమండలి సన్నద్ధమవుతోంది. ఈ నెల 29వ తేదీన స్థానిక పౌర గ్రంధాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని నిర్వహణ సమితి నాయకుడు జి కాసుల రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజానాట్యమండలి అభ్యుదయ గేయాలాపణతో ప్రారంభమయ్యే సభకు డాక్టర్ సి. స్టాలిన్ అధ్యక్షత వహిస్తారన్నారు. మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, జాతీయ ఉపాధ్యక్షులు కందిమళ్ళ ప్రతాపరెడ్డిలు హాజరవుతారని తెలిపారు. 29 న ఉదయం శ్రీ మాతృశ్రీ కళానికేతన్ వారి ఇది కథ కాదు నాటిక ప్రదర్శన ఉంటుందని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు అభ్యుదయ కవి శ్రీశ్రీ రూపకం నాటిక ప్రదర్శన, అనంతరం ముగింపు సభ ఉంటుందని అన్నారు. సభకు ముఖ్య అతిథిగా ఆర్ వి రామారావు హాజరవుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఫాసిస్టు నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా ఎన్నో సాంస్కృతిక ఉద్యమాలను నడిపిందని అన్నారు.

దోపిడీ ప్రభుత్వాలను తరిమికొట్టాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర-పాయకరావుపేట: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడి దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆరోపించారు. ఈనెల 14న సీపీఐ, సీపీఎం పార్టీలు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గురువారం పాయకరావుపేటలో బహిరంగ సభ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బందుల సుబ్బలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ సభలో బాలేపల్లి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులాల, మతాల మధ్య చిచ్చుపెడుతుందని ఆరోపించారు. 2కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెలికితీత, విభజన చట్టంలోని హామీలు అమలు పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ, టిడిపి ప్రభుత్వం ప్రధాని మోడి గురించి నోరు మెదపడం లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని విమర్శించారు. మహిళలు, దళితులు, మైనార్టీలు, ఆదివాసీలపై దాడులు పెరుగుతున్నాయని బాలేపల్లి ఆరోపించారు. బహిరంగ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ అధికారంలోకి వస్తే 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, కోటి 20లక్షల ఉద్యోగాలు తీసేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావు వెంకట జగ్గారావు, జి.గురుబాబు, కె.సన్యాసిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లు రాజు, సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జున్‌రావు, పట్టణ కార్యదర్శి యెలిపే రాజాబాబు, నాయకులు వదలి శివప్రకాష్, సీపీఎం నాయకులు ఎం.సత్యనారా యణ, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం: దేశ సంపదను కొల్లగొడుతూ కార్పొరేట్ కంపెనీ లకు దారా దత్తం చేస్తున్న బిజెపి ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాలను ప్రజలంతా గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్తారని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలం గప్పాడ గ్రామం లో ఉపాధిహామీ పథకం పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతూ కరపత్రాలు పంపిణీ చేశారు . దీనిలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో సమావేశమై ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇస్తున్న పథకాలపై ఆరా తీశారు .ఉపాధి హామీ కూలీల తో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారికి తగిన పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని మండి పడ్డారు .ఇదే విధంగా భవిష్యత్తులో కొనసాగితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబాబు,డి.సిహెచ్.క్రాంతి మండల కార్యదర్శి నల్లబెల్లి శ్రీరామ్మూర్తి మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కండిషన్ మానిటరింగ్ డొమైన్‌లో ఎన్.ఎస్.టి.ఎల్ అగ్రగామి : డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్ఎస్‌టిఎల్ లో కండిషన్ మానిటరింగ్ (ఎన్.సి.సి. ఎం 2023)పై నిర్వహిస్తున్న జాతీయ సదస్సును సెక్రటరీ మరియు చైర్మన్, డి.ఆర్.డి. ఓ డాక్టర్ సమీర్ వి. కామత్ ప్రారంభించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్ & మెటీరియల్స్) ఎం. జెడ్ సిద్దికి మాట్లాడుతూ పరికరాలను సమర్థవంతంగా నిర్వహించడం కోసం పరిశ్రమ 4.0 ప్రయోజనాలను పొందవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. డిజైన్ దశలోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటే సిస్టమ్‌లలో విశ్వసనీయత, భద్రత, లభ్యత మరియు నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి కండిషన్ మానిటరింగ్‌లో మెరుగుదల కోసం నిరంతర ఆస్కారం ఉందని ఆయన పేర్కొన్నారు. డైరెక్టర్ ఎన్ఎస్‌టిఎల్ డాక్టర్ వై. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రక్షణ మరియు పౌర రంగాలలో వ్యవస్థల సమర్థవంతమైన నిర్వహణ అవసరాన్ని నొక్కి చెప్పారు. 1990ల నుండి కండిషన్ మానిటరింగ్ డొమైన్‌లో ఎన్.ఎస్.టి.ఎల్ అగ్రగామిగా ఉందని మరియు మొత్తం దేశంలో ఈ రంగంపై అవగాహనను వ్యాప్తి చేయడంలో గణనీయంగా దోహదపడుతోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, విద్యా వేత్తలు, ఇంజినీర్లు, కమాండర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి గుడివాడ పర్యటన

విశాలాంధ్ర-పరవాడ: పరవాడ మండలం తానంలో శుక్రవారం ఉదయం ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్ పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయను న్నట్లు జడ్పీటీసీ పైలా సన్యాసి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా మైలాన్ నిధులు ఒక కోటి 15 లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం జల్ జీవన్ మిషన్లో భాగంగా పంచాయతీలో రూ.90 లక్షలతో చేపట్టబోయే రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొంటారన్నారు. పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఐటిడిఏ పిఓ అభిషేక్

విశాలాంధ్ర-అరకులోయ: పాడేరు ఐటిడిఏ పరిధిలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అధికారులకు ఆదేశించారు. గురువారం అరకులోయ మండలం పర్యటించారు. ఈ సందర్భంగా పద్మాపురం గార్డెన్ లో నిర్మిస్తున్న ట్రీ హట్స్, కొత్త వలస హెచ్ ఎన్ టిసిలో నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణపు పనులను పరిశీలించారు. కాటేజీల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు. చాపరాయిగెడ్డ సుందరీకరణ పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని స్పష్టంచేసారు. నిర్మాణపు పనులలో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని చెప్పారు. నాణ్యమైన నిర్మాణ సామగ్రిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిఇ సుబ్బారావు, మ్యూజియం మేనేజర్ మురళి, పద్మాపరం గార్డెన్ మేనేజర్ బొంజు బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ గ్రంథాలయానికి మహర్దశ

అందుబాటులోకి వచ్చిన సోల్ 3.0

విశాలాంధ్ర-విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని డాక్టర్ వి. ఎస్ కృష్ణ గ్రంథాలయానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం తోడైంది. సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. గత కొన్ని ఏళ్లుగా ఏయూ లోని ప్రతిష్టాత్మక గ్రంథాలయానికి చెదలు పట్టాయి. అధికారులు పూర్తి నిరాధారణతో గ్రంథాలయం ప్రతిష్ట మసకబారింది. వర్సిటీలోని ఒక్క విభాగాల్ని ప్రక్షాళన చేస్తూ వస్తున్న వీసీ ఆచార్య ప్రసాద్ రెడ్డి లైబ్రరీ పై దృష్టి సారించారు. కొన్ని నెలలపాటు శ్రమించి గ్రంథాలయానికి పూర్వవైభవం తీసుకొచ్చారు. దీంతో ఒక్కసారిగా గ్రంథాలయ రూపురేఖలు మారిపోయాయి. మొన్నటివరకు లైబ్రరీ ఏమైపోతుందో అనే బెంగపడిన పుస్తక ప్రియులు, విద్యార్థులు, పరిశోధకులు అచ్చరెవొందేలా రూపుదిద్దుకుంది. తాళపత్ర గ్రంథాల తో పాటు ఇతరత్రా డిజిటలైజేషన్ చేసారు. ఏకంగా సోధ్ గంగాలో జాతీయ జాతీయ స్థాయి ఎనిమిదో స్థానం కి ఎగబాకింది.

ఏయూ లైబ్రరీ పూర్తి ఆధునీకరణ

సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్ వేర్ ను లాంఛనంగా ప్రారంభించిన వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు మరింత ఉపయుక్తంగా గ్రంథాలయ సేవలు ఉండే విధంగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. రానున్న రెండు నెలల కాలంలో గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి, మరిన్ని సమర్ధవంతమైన సేవలు అందించే దిశగా సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కురుపల్లి లో పశువైద్య శిబిరం



విశాలాంధ్ర-పద్మనాభం : బుధవారం పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ కురుపల్లి గ్రామంలో ఎన్ఓఎన్ ఆధ్వర్యంలో కుటుంబ భలోపతి కార్యక్రమం ద్వారా పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాండ్రంగి పశువుల వైద్యశాల నుంచి డాక్టర్ అనుపమ వారి సిబ్బంది వచ్చి ఆవులను, కోడెదూడలను, మేకలకు తనిఖీలు నిర్వహించి, టీకాలను, విటమిన్ ఏ టాబ్లెట్స్ ను, మరియు పశువులకు యద రావడానికి తనిఖీలు మందులు పంపిణీ సేసారు. వ్యాధులు రాకుండా టీకాలను వేశారు. కార్యక్రమంలో సుమారు ఒక 50 మంది కుటుంబాలు వారు వారి యొక్క పశువులను తనిఖీ చేయించుకుని వైద్య చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ వై ఎన్ సిబ్బంది కర్తోతు దుర్గారాజు ప్రోగ్రాం మేనేజర్ వర్రీ సత్యనారాయణ ప్రోగ్రాం కోఆర్డినేటర్, శ్రీమతి చందక జానకి, మరియు మహిళా సంఘ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మందులను ఉచితంగా పంపిణీ చేసారు.

మన్యంలో మెరిసిన మాణిక్యం

విశాలాంధ్ర-అనంతగిరి: అనంతగిరి బొడ్డచెట్టు కాలనీ గ్రామానికి చెందిన బోయిన్న భీమన్న సుమిత్ర దంపతుల రెండవ కుమార్తె బోయిన్న శ్రీవల్లీ శశి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూప్ 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించి మొదటిస్థానంలో నిలిచిన మన్యంలో మెరిసిన మాణిక్యం అనిపించుకుంది. ఈమె అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు మేనకోడలు ఈ సందర్భం గా జడ్పిటిసి గంగరాజు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన నవోదయ విద్యార్థులు

విశాలాంధ్ర-పెందుర్తి: ఇటీవల వెలువడిన 2022-23 ఇంటర్ ఫలితాల్లో విశాఖకు చెందిన శ్రీ నవోదయ జూనియర్ కాలేజి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ భీశెట్టి రాము, డీన్ భీశెట్టి మురళీ ప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో కే. రితిక 990/1000మార్కులు సాదించి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలియచేసారు. అలాగే జె.సుకన్య 981/1000, ఎం. స్వాతిపట్నాయక్ 980/1000, బైపీసీలో సెకండ్ ఇయర్ సి.హెచ్ భార్గవి 980/1000, సి హెచ్. సాయి చందన శ్రీ 978/1000, జూనియర్ ఎంపీసీలో టి. శ్రీనిధి 464/470, టి. సాత్విక 462/14170, జె. రాణి రెడ్డి 461/470, జూనియర్ బైపీసీలో ఎ.రమ్య 430/440, టి కాషిఫా 430/440. ఇ హర్షవర్ధన్ 427/440, పి మేనక 427/440 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. నవోదయ విద్యార్థులు సాదించిన విజయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి ఎంతో ఉందని కరస్పాండెంట్ భీశెట్టి రాము ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ప్రిన్సిపాల్స్ ఎ. వి అప్పారావు, జి సన్యాసి నాయుడు, జగదీష్, దిలీప్ కుమార్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ని ముఖ్యమంత్రి చేయాలి

విశాలాంధ్ర-కె కోటపాడు : ఉత్తరాంధ్రకు నిధులిచ్చి అభివృద్ధి చేయకుండా విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తుంటే కళ్లప్పగించి చూస్తూ రాజధాని పేరుతో విశాఖ ప్రజలను మోసంచేస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైల ప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని చంద్రయ్యపేట గ్రామంలో రాష్ట్రానికి ఇదేంకర్మ కార్యక్రమంతో పాటు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో పాలన పోయి సైకిల్ పాలన వస్తేనే రాష్ట్రం సుభిక్షతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రొంగలి మహేష్, టీడీపీ నాయకులు సబ్బవరపు రాము నాయుడు, క్లస్టర్ ఇన్చార్జి కన్నూరు సూర్యనారాయణ ,గవిరెడ్డి దేముడు బాబు, ఏ కోడూరు మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు ,సింగిందపాలెం సర్పంచ్ వెలగల పైడమునాయుడు, కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు ,మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తో పాటు గ్రామ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర-కొమ్మాది : స్థానిక స్వతంత్రనగర్ లో కొలువైఉన్న శ్రీలక్ష్మీ దేవి అమ్మవారి జాతర మహోత్సవాలు, 7వ వార్షికోత్సవ కలశ ప్రతిష్ట అంకురార్పణ ఘనంగా నిర్వహించారు. గురువారం నుంచి మొదలైన జాతర మహోత్సవాలు శనివారం ముగుస్తాయని, ఆదివారం మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు వాసుపిల్లి బండియ్య,కార్యదర్శి బాలుపాత్రో తెలియజేశారు. స్వతంత్రనగర్ పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.అతిథులుగా విచ్చేసిన 5వవార్డ్ కార్పొరేటర్ మొల్లిహేమలత, రమణ,7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ,వెంకటరావు,టిడిపి రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి మొల్లిలక్ష్మణరావు,టిడిపి సీనియర్ నాయకులు వాండ్రాశి అప్పలరాజు, నమ్మి శ్రీను,పొట్టి ప్రసాద్,కనకదుర్గ ఈవెంట్స్. కొర్రాయి సురేష్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, కలశస్థాపన కావించి జ్యోతి ప్రజ్వలనచేసి జాతరను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి కొత్తాల శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీ దిబ్బశ్రీను,ఉప కోశాధికారి దాదిగౌరీశంకర్, అనుపోజు నాగరాజు, బావిశెట్టి జగన్, కరకాని ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వమ్మవరం మట్టి తవ్వకాలపై ఏఈ విచారణ



విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలోని వమ్మవరం గ్రామంలో మట్టి తవ్వకాలపై ఇరిగేషన్ ఎఈ చిన్నారావు విచారణ చేపట్టారు. బుధవారం అర్ధరాత్రి చెరువు లో మట్టి అక్రమంగా తరలిస్తున్న సమాచారం తో పలు శాఖల అధికారులు తనిఖీలు చేశారు. అధికారులు వస్తున్నట్లు సమాచారం తో అక్కడి నుండి వెళ్లిపోయారు. దీంతో గురువారం ఎఈ చిన్నారావు మట్టి తవ్వకాలు పరిశీలన చేసి కొలతలు వేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వినతులు



విశాలాంధ్ర-ఆనందపురం: మండల ప్రజా పరిషత్ కేంద్రంలో మంగళవారం నిర్వ హించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పాలవలస సర్పంచ్ నాగోతు నరసమ్మ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో ఉన్న జగనన్న ఇల్లులకు ఇప్పటివరకు ఒక్కదానికి కూడా స్కీం లు ఇవ్వలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు, అలాగే వేములవలస ఇల్లు సమస్య గురించి జడ్పిటిసి కోరాడ వెంకట్రావు మాట్లాడుతూ పంచాయతీలో 459 ఇల్లు మంజూరు అయ్యాయి కానీ ఇప్పటివరకు ఏ ఒక్కటి కూడా లబ్ధిదారులకు అందలేదని త్వరగా పరిష్కారం చేయాలని తెలిపారు, టీపీ కల్లాలు సర్పంచ్ కోన పైడ్రాజు మాట్లాడుతూ తమ పంచాయతీలో పాఠశాల భవనం నిమిత్తం అనేకసార్లు తమ దృష్టికి తీసుకు వచ్చామని, అలాగే ఇళ్ల స్థలాలు మార్చే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, మంచినీళ్లు బోర్లు వేయించాలని కోరారు, మామిడిలో సర్పంచ్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా తమ పంచాయతీలో ప్రజలకు పనులు జరగడం లేదని ఆరోగ్యశ్రీలో నిధులు లేవని, పంచాయతీ నిధులు లేక గ్రామాలను అభివృద్ధి చేయలేకపోతున్నామని ప్రజలకు ముఖం చాటు వేసే పరిస్థితి ఏర్పడిందని అలాగే రోడ్లు మంచినీళ్లు సమస్య తెలియజేశారు, కార్యక్రమంలో ఎంపీడీవో అడప లవరాజు, తాసిల్దార్ లోకవరపు రామారావు, ఇన్చార్జ్ మహేష్, పార్టీ అధ్యక్షులు బంక సత్యం, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జడ్పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీలు, పాండ్రింకి శ్రీను బొట్ట ధనలక్ష్మి, ఎంసి చైర్మన్ సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచులు, గంర్రెడ్డి శ్రీను, లోడగల రాజేశ్వరి, కోన పైడ్రాజు, బి ఆర్ బి నాయుడు, చందక లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

భీమిలి కస్తూరిబా పాఠశాలకు ఇంటర్‌లో సత్ఫలితాలు

ప్రిన్సిపాల్ గంగాకుమారి అభినందనలు

సాయికావ్య 407/440 | కె అంజలి 374/440 | ఎం.కుమారి 354/440

విశాలాంధ్ర-భీమిలి : ఇంటర్మీడియట్ ఫలితాల్లో భీమిలి కస్తూరిభా బాలికా విద్యాలయంకి ద్వితీయ సంవత్సరంలో 78 శాతం, ప్రథమ సంవత్సరంలో 61 శాతం ఉత్తీర్ణత వచ్చిందని పాఠశాల ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలియ జేసారు. భీమిలి పాఠశాలలో బైపీసీ గ్రూప్ ఒకటే ఉందని అన్నారు. 32 మంది విద్యార్థినిలు పరీక్షలకు హాజరుకాగా 25 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. 1000 మార్కులకు గాను 900 మార్కులు దాటిని వారు 5 గురు విద్యార్థినిలు, 850 మార్కులు దాటిన వారు 4గురు విద్యార్థినులు ఉన్నారని ఆమే చెప్పారు. అందులో పి. లహరి అనే విద్యార్థినికి 960 మార్కులు వచ్చి పాఠశాల టాపర్ గా నిలిచారని, మండలంలో ఉత్తీర్ణత టాపర్ జాబితాలో లహరికి స్థానం లభించడం పట్ల ప్రిన్సిపాల్ ఆనందం వ్యక్తంచేసారు. అదేవిదంగా ప్రథమ సంవత్సరంలో ఎన్. సాయి కావ్య అనే విద్యార్థినికి 407 మార్కులతో పాఠశాల టాపర్ గా నిలిచిందని చెప్పారు. వీరంతా పేద కుటుంబాల నుండి వచ్చిన సరస్వతి ఆణిముత్యాలని, కస్తూరిబా పాఠశాలలో ఉన్నతమైన విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని, ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థుల సంక్షేమం కోసం ఎంతో ఆర్థిక భరోసా ఇస్తుందని అన్నారు. చదువులోనే కాక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో కూడా పిల్లలకు ఉన్నతమైన కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రతీ తల్లిదండ్రులు తన పిల్లల ఉన్నతమైన ఉజ్వల భవిష్యత్ కోసం కస్తూరిబా పాఠశాలలో చేర్పించే విధంగా ఆలోచన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ గంగా కుమారి విజ్ఞప్తి చేసారు.

సోషల్ ఆడిట్‌పై ఓరియంటేషన్

విశాలాంధ్ర-నక్కపల్లి: మండలంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో ఎంఇవో డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో ఒక రోజు ఓరియంటేషన్ తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇవో మాట్లాడుతూ పాఠశాలలో అమలు వున్న వివిధ కార్యక్రమాలు అమలు, వాటి నిర్వాహణా తీరును పరిశీలించడానికి ప్రధానో పాధ్యాయులు/ ప్రిన్సిపాల్‌ల ఆధ్వర్యంలో తల్లిదండ్రులు కమిటీల చేత తనిఖీ చేయించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలల పనితీరును వీరు వివిధ అంశాలలో పరిశీలించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు కమిటీ సభ్యులకు, తల్లిదండ్రులకు పాఠశాలలో బోధన బోధనేతర సిబ్బందిలో జవాబుదారీతనాన్ని పెంచడానికి ఇది దోహదపడుతూ, దీనిలో భాగంగా 77 అంశాలలలో కూడిక ఒక యాప్‌ని రూపొందించడం జరిగిందని, పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఆ యాప్‌లో హెచ్‌ఎంలు విధిగా పూర్తి చేయాలన్నారు. ఈ శిక్షణలో పివి సన్యాసినాయుడు, రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వైవిఅప్పారావు, కృష్ణమోహన్ పుష్యరాగం, ప్రతాప్ కెజిబివి ప్రిన్సిపాల్ వై.త్రివేణి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డు కుంచమాంబ కాలనీలో గడప గడపకు...

విశాలాంధ్ర-మల్కాపురం: గడపగడపకు మన ప్రభుత్వం 73వ రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం 58వ వార్డు కుంచమాంబ కాలనీ సచివాలయంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య వార్డు అధ్యక్షులు గులిగిందల కృష్ణ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా శ్రీహరిపురం జీవీఎంసీ హైస్కూల్ రామాలయం ముఖ ద్వారం నుంచి నిర్మించిన 15.10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు పీవీ సురేష్, జెసిఎస్ కన్వీనర్ పిల్ల కన్నబాబు,59 వార్డ్ అధ్యక్షులు పుర్రె సురేష్, 90 వార్డు నాయకులు నమ్మి శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చుక్కా వరలక్ష్మి, తోనంగి వెంకట రమణి, స్థానిక నాయకులు అంగ రాంప్రసాద్, డి. వేణుగోపాల్ రెడ్డి, గాదె అప్పన్న, శ్రీనివాసరాజు, ప్రసాద్ రెడ్డి, బర్రి సంతోష్, సచివాలయ కన్వీనర్లు చిప్పల సంతోష్, బాబి, రాంబాబు కన్నబాబు, కనకమాలక్ష్మి, వరలక్ష్మి, సత్య,వెంకటలక్ష్మి పశ్చిమ నియోజకవర్గం సోషల్ మీడియా కో -కన్వీనర్లు స్పందన బాబురావు, టి. సంపత్ కుమార్ తదితర్లు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: మండలంలో జంపపాలెం గ్రామంలో గురువారం దుర్గమ్మ అమ్మవారి ఆలయ సప్తమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామ,పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తెల్లవారుజామున నుంచే అమ్మవారికి పసుపు కుంకుమ రవిక, చీరలను సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చింతల వీధిలో అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర-పాడేరు : స్థానిక మండలం లోని చింతల వీధి సచివాలయం పరిధిలో విచ్చలవిడిగా అక్రమ అనధికారిక నిర్మాణాలు చేస్తున్న రెవెన్యూ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతల వీధి పంచాయతీ పరిధిలో నడుమ్ వీధి, చింతల వీధి పరిసర ప్రాంతాలలో రోడ్డు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు అనధికారిక నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు సహితం కబ్జాకు గురవుతున్నాయి. మొదలుకొని చింతల వీధి వరకు రోడ్డు ఇరువైపులా పంట పొలాలు ప్రభుత్వ స్థలాలు(పాలిటెక్నిక్ మెడికల్ కాలేజ్ సమీప ప్రభుత్వ స్థలాలు)కబ్జాకు గురై అన్యాక్రాంతం అవుతున్నాయి. స్థానిక పంచాయతీ రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పై గిరిజన ప్రజా సంఘాలు నుండి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది స్థానిక పెత్తందారులు గిరిజన ఇతరులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడి రెవెన్యూ పంచాయతీ అధికారులకు ప్రలోబాలకు గురించేసి పెత్తనం చాలా ఇస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ పంచాయతీ వ్యవస్థను పటిష్టపరిచి గిరిజన హక్కులు చట్టాలను కాపాడి స్థానిక ప్రజలకు మేలు చేకూర్చాలని కోరుతున్నారు.

భగీరథ మహర్షి కృషి పట్టుదల ఆదర్శం

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : కార్యక్రమాన్ని మొదలుపెట్టినప్పుడు విజయం సాధించే వరకు కృషి పట్టుదలతో పని చేయాలని భగీరథ మహర్షి నుంచి మనం తెలుసు కోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భగీరథ జయంతి కార్యక్రమంలో ఆయన జ్యోతి వెలిగించి భగీరథ మహర్షికి అంజలి ఘటించారు. భగీరథుడు తపస్సు తో పాటు ఎన్నో ప్రయత్నాలు చేసి గంగను భూమికి తీసుకు వచ్చారని తెలియజేశారు. అదే స్ఫూర్తితో సమాజానికి మేలు చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాల వారి కోసం ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. నగర కుల యువత అభివృద్ధికి వృత్తి విద్య శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలను పొంది అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్ కుమార్ మాట్లాడుతూ భగీరధుని వృత్తాంతాన్ని వివరించారు. సగర కులాన్ని బీసీ-డీ నుండి బీసీ-ఏ కు మార్పు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ, వైస్ జడ్పీపి బీశెట్టి వరాహ సత్యవతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే. రాజేశ్వరి, ఉమ్మడి విశాఖ జిల్లా సగర సంఘ అధ్యక్షులు గుర్రం నూకరాజు, సగర నాయకులు నక్కా రాంబాబు, నక్కా పెంటయ్య గుర్రం నాగరాజు ఏబిసిడబ్ల్యూఓలు తదితరులు పాల్గొన్నారు

నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించండి

- భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దాం - జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖ పట్నం: ప్రపంచాన్నే పీడిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాల్సిన అవ సరం ఎంతైనా ఉందని జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రతినిధులు, ప్లాస్టిక్ హోల్ సేల్, రిటైల్ డీలర్స్, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్, సూపర్ మార్కెట్లు తదితర వ్యాపారస్తులతో నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణ చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ, భావితరాలకు మంచి ఆహ్లాదకరమైన వాతా వరణం కల్పించేందుకు అందరి సహకారంతో ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమం చేపట్టడం జరుగు తుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. మానవాళితో పెనువేసుకు పోయిన నిషేధిత ప్లాస్టిక్‌ను విడనాడి ప్రత్యామ్నాయ వస్తువులను వాడాలని సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ డీలర్స్ లాభార్జన కోణంలో వ్యాపారాలు చేయకుండా ప్రజా ఆరోగ్యరీత్యా వ్యాపారాలు చేయాలన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులో ఉన్నాయని, అందుకు నిషేధిత ప్లాస్టిక్ ను పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలు మనందరికీ తెలుసని వాటి వల్ల మానవాళితోపాటు జలజీవరాసులకు ప్రమాధం వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ నియం త్రణపై ప్రతి ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టి వాటిని నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే జివిఎంసి ప్లాస్టిక్ నిషేధంపై అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, మీ అందరి సహకారంతో విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీ సిటీ గా తీర్చిదిద్దడం మన అందరి బాధ్యతగా భావించాలన్నారు. సుందర విశాఖ నగరానికి నిత్యం పర్యాటకులు, సందర్శకులు అధికంగా వస్తారని వారికి మంచి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనదేనన్నారు. పలు ప్రజా సంఘాలు ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థిదశ నుండే ప్లాస్టిక్ నిర్మూలన పై అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ భూతం పై విద్యార్థులలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీల ద్వారా వారిలోని సృజనాత్మకను వెలికి తీసుకురావాలన్నారు. అలాగే నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్ సభ్యుల సూచనలు, సలహాలను జివిఎంసి తూ.చ. తప్పక అమలుచేస్తుందని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, యుఎన్డిపి కో-ఆర్డినేటర్ ఎన్ ఎస్ రాజమణి, శానిటరీ సూపర్వైజర్లు, హెూటల్, రెస్టారెంట్, కిరాణా వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండల కేంద్రం లో గల మండల తహసీల్దార్ కార్యాలయం నుండి దుర్గగుడ గ్రామం వరకు జిల్లా పరిషత్ నిధులు 5 లక్షలతో సీసీ రోడ్డు పనులను గురువారం ఎంపీపీ అరిసెల సీతమ్మ వైసిపి అధ్యక్షుడు పాంగి మల్లికార్జునరావు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల తాసిల్దార్ కార్యాలయం నుండి దుర్గగుడ గ్రామానికి వెళ్లాలంటే వర్షాకాలంలో రహదారి బురద మాయంగామారటం తో ప్రజలు ఆ రహదారి గుండా రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు గురి అయ్యే వారిని వారు అన్నారు సీసీ రోడ్డు కావాలని వినతి పత్రం అందించడంతో జెడ్పీ మంజూరు చేసి ఆ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు, కార్యక్రమంలో సుజనకోట ఎంపిటిసి సుబ్బలక్ష్మి వైసీపీ నేతలు జగబంధు తిరుపతి సన్యాసిరావు పులిరాజు దాసు జయదేవ్ గ్రామ సచివాలయ కన్వీనర్ ఎస్ తిరుపతి రావు పీత్ బాస్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

VMRDA **విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ**

పత్రికా ప్రకటన

ఆన్‌లైన్ నెం. 1093/0002/LP/VZM/2023, తేది. 21-04-2023

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునదేమనగా శ్రీ జాస్తి శరత్ బాబు మరియు ఇతరులు, విజయనగరం జిల్లా, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, సాయినగర్ గ్రామం నందలి నందలి సర్వే సంఖ్య 95/1 Part, 95/2 Part, 95/3 Part, 95/3-A-2 లో ఎకరములు 5.7322 సెంట్లు గల భూమిని లే అవుట్ అనుమతి నిమిత్తం దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆన్‌లైన్ 1093/0002/LP/VZM/2023 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లే అవుట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీచేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.

సం/- మెట్రోపాలిటన్ కమీషనర్, వి.ఎం.ఆర్.డి.ఏ

ఐదో వార్డు లో అక్రమ నిర్మాణాల జోరు!

సచివాలయ , స్థానిక నేతలు అండతో గెడ్డ మాయం..!

విశాలాంధ్ర-మధురవాడ : గెడ్డ లను కప్పేసి , భారీ నిర్మాణం సాగుతున్న అడ్డుకునే వారే కరువయ్యారు. అక్రమ నిర్మాణాల కు అధికారులు కళ్ళు మూసుకొని అండదండలు అందిస్తూ అనుమతులు మంజూరు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అన్నీ సక్రమంగా నిర్మాణాల అయితే గెడ్డ ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు. ఐదో వార్డు గణేష్ నగర్ గుడి సమీపంలో గెడ్డ ను ఆక్రమించి భారీ నిర్మాణం జోరుగా సాగుతుంది. గతం లో లాగే నేడు కూడా సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ, స్థానిక నాయకులు సహకారం అందిస్తున్నారని, అక్కడే మరో భవనం మొదటి అంతస్తు నిర్మాణం సాగుతుంది. ఇలా అక్రమంగా అనధికార నిర్మాణాలు ఏదేచ్ఛగా కొనసాగుతున్న అరికట్టే వారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్య కేంద్రం ఎదురుగా సెల్లార్ లేకుండా, నకిలీ పట్టాల చూపించి, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన భూమితో పాటు కొంత భాగం గడ్డ ఆక్రమించారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కాగా నిర్మాణాలు జరుగుతున్నది గెడ్డ కాదని అది సర్వే నెం.37అని ఒకరు సర్వే నెం.35/7 అని మరొకరు చెబుతున్నారు. ఏది ఏమైనా అక్కడి గెడ్డ ఏమయిందన్న దానికి సమాధానం లేదు. అధికార పార్టీకి చెందిన ఓ నేత చక్రం తిప్పి భారీగా ముడుపులు దండుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు, గెడ్డలు, కొండలు ఇలా ఖాళీ జాగా కనిపిస్తే చాలు విచ్చల విడిగా నిర్మాణాలు ఎదేచ్ఛగా జరుగున్నాయి.వారికి సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు, రాజకీయ నాయకులకు కొమ్ముకాస్తు న్నా రంటూ స్థానిక ప్రజలు వాపోతున్నారు. జీవి ఎంసీ టౌన్ ప్లానింగ్‌కి తెలిసేఇదంతా జరుగుతుందని , సర్వే.నెం31/3 లో గెడ్డ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు సాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదో వార్డులో రెండు పార్టీలకు సంబంధించిన నాయకులకి ముగ్గురికి వాటాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. జరుగు తున్న ఈ నిర్మాణాలను పరిశీలించి తక్షణమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ప్లాను లేకపోయినా నిర్మాణం జోరుగా సాగడ మే గాక కొన్నింటికి అనుమతులు ఇవ్వడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోరమాండల్ నిధులతో సంక్షేమ హాస్టళ్ల పునర్నిర్మాణం

ప్రారంభించిన కలెక్టర్ డా॥ మల్లికార్జున

విశాలాంధ్ర-పెదగంట్యాడ: పెదగంట్యాడ మండలం నడుపూరు , దయాళ్ నగర్ లలో కోరమండల్ ఇంటర్నేషనల్ వారి సిఎస్ఆర్ నిధులు రూ. 93 లక్షలతో పునర్నిర్మాణం చేసిన ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాలను గురువారం ఉదయం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తో కలిసి కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నడుపూరు లో సుమారు 20 లక్షల అంచనా తో కోరమండల్ సంస్థ అభివృద్ధి పనులు చేపట్టగా, నేటికి 70 లక్షలు వరకు ఖర్చు చేసారని అన్నారు. ఎంతో అందంగా తీర్చిదిద్దారని తెలిపారు. తను కూడా చిన్నతనంలో హాస్టల్లో చదువుకున్నానని , ఆనాడు ఇటువంటి సదుపాయాలు లేవని అన్నారు . ఇప్పుడు చదువుకుంటున్న విద్యార్థులు ఈ సదుపాయాలు వినియోగించుకొని చదువులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికల సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేసేందుకు సహకరించిన కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ వారిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం కూడా నాడు-నేడు పథకం ద్వారా రాష్ట్రంలో ఎన్నో పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇటువంటి సుమారు 10 వసతి గృహాలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో రెండు వసతి గృహాలు కోరమండల్ వారి సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని , అలాగే దివిస్ లాబరేటరీస్ వారి సహకారంతో మరొక రెండు హాస్టల్స్ మిగిలిన ఆరు హాస్టల్స్ అభివృద్ధికి వివిధ సంస్థలు, యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. అనం తరం దయాల్ నగర్ లో 23 లక్షల తో అభివృద్ధి చేసిన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ బాగా వెనకబడిన పెదగంట్యాడ గ్రామంలో సి ఎస్ ఆర్ నిధులతో ఇటువంటి కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ చేపట్టడం చాలా ఆనందంగా ఉందని అన్నారు . కోరమండల్ యాజమాన్యం వారు ఈ వసతి గృహాలను చాలా అధునాతనంగా అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 75 వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి, పులి రమణారెడ్డి,డీసీఎంఎస్ చైర్పర్సన్ పల్లా చినతల్లి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి , కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞాన సుందరం, హైదరాబాద్ సి ఎస్ ఆర్ హెడ్ అమృత శ్రీవాత్సవ , డి ఐ సి జనవరి మేనేజర్ గణపతి, జిల్లా కోపరేటివ్ ఆఫీసర్ మిల్టన్, కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి, విద్యార్థినులు, స్థానిక నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులు జాగ్రత్తలు తప్పనిసరి

విశాలాంధ్ర-అనకాపల్లి: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని మూలపేట గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సర్పంచ్ బిశెట్టి గంగ అప్పలనాయుడు సందర్శించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా గ్రామాల్లోని ప్రజలకు వైద్యసేవలు చేరువయ్యాయని తెలిపారు. ఎండలు విపరీతంగా మండు తున్న కారణంగా బయటకు వెళ్ళేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను నేరుగా అందించిన ప్రభుత్వం వైకాపా

తాజంగి సచివాలయ కన్వీనర్ సదాశివ

విశాలాంధ్ర-చింతపల్లి : అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను గడప గడపకు నేరుగా చేరవేస్తున్న ప్రభుత్వం వైకాపా అని ఆ పార్టీ సచివాలయ కన్వీనర్, తాజంగి పంచాయతీ వార్డు సభ్యుడు కిలో సదాశివ అన్నారు. మండలంలోని తాజంగి పంచాయతీ లంబడపల్లి, సప్పడిమెట్ట గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గురు వారం నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ మరో కన్వీనర్ సీస కమలతో కలిసి ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు వారికి ఏ ఏ పథకాలు అందుతున్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సదాశివ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ ఏర్పడిన నాటినుండి సచివాలయ వాలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారులకు చేరవేస్తున్న ప్రభుత్వం వైకాపా అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను పొందుతున్న ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి జగనన్న నే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వంతల బాబురావు, గృహ సారధులు కిలో రాము. సీస సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో నక్కపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు స్వామి వారి ఉత్సవ మూర్తులకు అర్చకులు పంచామృతాభిషేకం, పుణ్యావాహచనం, మండపారాధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయ కమిటి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసారు. అనంతరం భక్తులు స్వామి వారి తీర్ధ ప్రసాదాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహీంద్రా బొలెరో ఎంఎక్స్ఎక్స్ పికప్ శ్రేణి విడుదల

విశాలాంధ్ర-విశాఖ సిటీ: భారతదేశంలో నెం.1 పికప్ బ్రాండ్ అయిన బొలెరో పిక్ అప్ తయారీదారులైన మహీంద్రా మహీంద్రా (ఎం అండ్ ఎం), తన పూర్తిగా సరికొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ శ్రేణిని నేడు విడుదల చేసింది. రూ.7.85 లక్షల (ఎక్స్‌షోరూమ్) దరతో ప్రారంభమై పూర్తి గా సరికొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ శ్రేణి శక్తివంతమైన ఫీచర్‌లు ,పనితీరును అందించేలా కస్టమర్‌లు, ఆపరేటర్‌లకు సాటిలేని విలువ ఆధారిత ప్రయోజనాల్ని కలిగిస్తుందని ఆ సంస్థ ప్రజలు చెప్పారు. తేలికైన, మరింత ధృఢంగా, బహుళ ప్రయోజనాల పూర్తిగా సరికొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ శ్రేణి పేలోడ్ సామర్థ్యం, ఇంధన సామర్థ్యం, భద్రత మొత్తం డ్రైవింగ్ అనుభవాలకు సంబంధించి కొత్త మైలురాళ్లను సృష్టిస్తుందన్నారు. ఇది మునుపెన్నడూ లేనంత ఎక్కువ విలువను అందించడానికి స్మార్ట్ ఇంజనీరింగ్‌ను కూడా మేళవించిందని, కొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ శ్రేణిని కనీసం రూ.24,999 డౌన్ పేమెంట్‌తో బుక్ చేసుకోవచ్చు అన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-మాకవరపాలెం : మండలం తామరం గ్రామంలో జగనన్న వసతి దీవెన లబ్ధిదారులు గురువారం ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రుత్తల లక్ష్మీ, వైసిపి నాయకులు హరిబాబు, సర్పంచ్ చెల్లారత్నం, ఉప సర్పంచ్ ప్రసాద్, పిఏసిఎస్ డైరెక్టర్ అయ్యన్న వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణరావు, వైసిపి గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు దొరబాబు, మాజీ ఉప సర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం

విశాలాంధ్ర-మాకవరపాలెం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు సచివాలయ వ్యవసాయ సహాయ కులకు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందుగా ప్రణాళికలు సిద్దంచేసుకోవాలని సూచించారు. రైతు భరోసాకు రైతులందరూ దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఒ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా చిరంజీవిరావు గెలిపించడంపై హర్షం



విశాలాంధ్ర-జికెవీధి : జికెవీధి మండలం రింతాడ, పెదవలస, దేరాల, జికెవీధి, సప్పర్ల, దార కొండ పాఠశాలలను గురు వారం మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సందర్శించారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ బలపర్చిన వేపాడ చిరంజీవిరావు విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు, నిరుద్యోగ యువతీ యువకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యల పట్ల పోరాడుతామని, అలాగే జీవో నెంబర్ 3 కోసం కూడా పోరాడుతానన్నారు. గిరిజన ఆదివాసుల ఎస్టీ కులస్తులను బోయ వాల్మీకి బెంతి ఒరియావారిని మా గిరిజన ఎస్టీలలోకి కలపడం మేముపూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు ఈ విషయంపై మాట్లాడకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే గిరిజన ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ముక్కలి రమేష్, మండల టీడీపీ యువత అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు మహేష్, రాజారావు, మాజీ జెడ్పీటీసీ గంటా నళినికృష్ణ, గుంట బుజ్జిబాబు, టిఎన్ఎస్ఎఫ్ రంగారావు, శ్రీరాములు, క్లస్టర్ ఇంచార్జి పందురాజు, పోతురాజుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన్ దీపక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎస్టీ ఎస్సీ మాజీ కమీషన్ సభ్యుడు అబ్రహం డిమాండ్

విశాలాంధ్ర-హుకుంపేట: ప్రభుత్వ పర్యవేక్షణ, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే 5వ తరగతి చదువుతున్న విద్యార్థి మజ్జి జ్ఞానదీపక్ మృతి చెందాడని ఎస్టీ ఎస్సీ మాజీ కమీషన్ సభ్యుడు సివేరి అబ్రహం పేర్కొన్నారు. గురువారం మృతి చెందిన బాలుడి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రధాన జాతీయ రహదారి పక్కన నీరు నిల్వ చేయకుండా ఉంటే నేడు బాలుడు ప్రాణాలతో ఉండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు తమ స్వలాభం కోసం అనేక పనులు చేస్తుంటారని వాటిని ప్రభుత్వం అధికారులు గుర్తించి ప్రమాద స్థలలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలకు నష్టంలేకుండా చూడాలని కోరా రు. బాలుడి మృతి సంబంధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇకపై ఇటువంటి ప్రమాదాలు జాతీయ రహదారి మూలంగా పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరా వు, హుకుంపేట మండల తెలుగు యువత అధ్యక్షుడు కామేశ్వరరా వు, సీనియర్ నాయకులు అప్పల స్వామి, వార్డ్ మెంబర్ పాడి వేంకట్, తెలుగు యువత సురేష్, కామేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ప్రచార కమిటీల్లో స్థానం

వైసీపీ అనకాపల్లి జిల్లా ప్రచార కమిటి అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా

విశాలాంధ్ర-పాయకరావుపేట: వైసీపీ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి నియోజకవర్గ స్థాయి ప్రచార కమిటీల్లో స్థానం కల్పిస్తామని వైసీపీ అనకాపల్లి జిల్లా ప్రచార కమిటి అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా తెలిపారు. స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ధనుంజయ్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో ప్రచార కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 7నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి ముఖ్యంగా యువత, 50శాతం మంది మహిళలతో కమిటీలు వేస్తామని తెలిపారు. నియోజవర్గ స్థాయిలో ప్రచారకమిటీ అధ్యక్షలు, ఇద్దరు ఉపాధ్యక్షులు, 4గురు ప్రధాన కార్యదర్శులు, 10మంది కార్యదర్శు లతో ప్రచార కమిటీలు వేస్తామని తెలిపారు. కమిటీలో స్థానం దక్కించుకున్న వారు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ గురించి, ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్య వంతులను చేయాలన్నారు. దళారులు లేకుండా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు, రాబోయే ఎన్నికలకు ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అడిగే హక్కు, ధైర్యం వైసీపీ పార్టీకే ఉందన్నారు. తనకు పదవి కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, దాడిశెట్టి రాజా, పార్టీ జిల్లా అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆందోళనకు దిగిన ప్రజా, మహిళా సంఘాలు



విశాలాంధ్ర-చోడవరం: మహిళలపై లైంగిక వేధింపులు దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మహిళా, ప్రజా సంఘాల వారు బాధితులతో కలసి గురువారం చోడవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 13 న చీడికాడ మండలం వరహాపురం గ్రామంలో యలమంచిలి లక్ష్మి అనే వివాహితపై శారీరకంగా, లైంగికంగా దాడి చేసిన యలమంచిలి చిన్న అనే వ్యక్తి పై నిర్భయ, దిశ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై చీడికాడ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి, తుతూ మంత్రంగా కేసు కట్టి అనంతరం స్టేషన్ బెయల్ ఇచ్చి, ముద్దాయిని వదిలేసారు అని తెలిపారు. దీనిపై మహిళా సంఘాల వారు పోలీసులను ప్రశ్నిస్తే ముద్దాయి అందుబాటులో లేదని సమాధానం చెప్పడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. నేరం జరిగి 15 రోజులు అయినప్పటికీ, ఫిర్యాదు అందుకున్న చీడికాడ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మహిళలకు, ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ ఏమిటో అర్థం అవుతోందన్నారు. బాధితురాలు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు మండల కార్యదర్శి ఆర్.దేముడు నాయుడు, బాధితురాలు భర్త యలమంచిలి రాము, యలమంచిలి ఎర్రయ్య, యలమంచిలి మల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగిరెడ్డి సత్యనారాయణ, మిస్క సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పెందుర్తి వేంకటాద్రి బ్రహ్మోత్సవాలు



విశాలాంధ్ర-పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుపతిగా భాషిల్లుతున్న పెందుర్తి వేంకటాద్రిపై బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుండి ప్రారంభమౌతాయని ఆలయ ప్రధానార్చకులు మోర్తా రామానుజాచార్యులు తెలియచేసారు. దేవాదాయ శాఖ అధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విష్వక్సేనపూజ, అంకురారోపణ, శనివారం ధ్వజారోహణ, హోమాలు.. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పములతో స్వామికి విశేష అర్చన. ఆదివారం వైశాఖ శుద్ద దశమి సాయంత్రం స్వామి వారి కళ్యాణం, సోమవారం సాయంత్రం తిరువీధి. స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాదికి ఒకసారి స్వామి వారు రథంపై ఊరేగింపుగా, తప్పెట గుళ్ళు, పులి వేషాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవిందనామ స్మరణల నడుమ సప్తగిరి నగర్ లోని అలిమేలు మంగమ్మ ఆలయానికి వెళ్ళి వేడుకలు చేసుకుని వస్తారని వెల్లడించారు. మంగళవారం ఉదయం చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలసి దివ్య స్నానమాచరింపు, సాయంత్రం శ్రీ పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవలతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమౌతాయని రామానుజాచార్యులు తెలియచేసారు

మోదకొండమ్మ జాతర గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-హుకుంపేట: మే నెల 07 తేది నుండి 09 తేదీ వరకు మూడు రోజులు జరిగే హుకుంపేట శ్రీ మోద కొండమ్మ జాతరను విజయవంతం చేయాలనీ కోరుతూ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, కమిటీ సభ్యులు కలిసి గురువారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజులు పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మూడు రోజులు భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగు జాగ్రతలు కమిటీ సభ్యులు తీసు కోవాలని పేర్కొన్నారు. మండ ల కేంద్రంలో జరుగు మోదకొం డమ్మ జాతరకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మన్యంలోనే పెద్ద మండలం మోదకొండమ్మ జాతరను అంతే ఘనంగా నిర్వహించాలని జాతరలో అల్లర్లు లేకుండా కట్టదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆయన కమిటీ సభ్యులకు సూచించారు. ఈ ఉత్సవాల్లో భారీగా విద్యుత్ ఆలంకారణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేశాలు, శక్తి వేశాలు, పలు ఆక్షర్యణీయ కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నామని కమిటీ సభ్యులు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ మత్స్యలింగం, స్థానిక సర్పంచు వెంకట పూర్ణిమ, మాజీ జడ్పీటీసీ కాసులమ్మ, మాజీ ఎంపీపీ రవిప్రసాద్, ఉత్సవకమిటీ అధ్యక్షుడు అనీల్, ప్రసాద్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు..

నోరిల్స్క లో ఆర్కిటిక్ టూరిజం వీక్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఇటీవల నోరిల్స్క లో జరిగిన ఆర్కిటిక్ టూరిజం వీక్ ఇంటర్ రీజినల్ ఫోరమ్ లో ఫార్ నార్త్ లో పర్యాటక పరిశ్రమ యొక్క సుస్థిర అభివృద్ధి సూత్రాలు, ఆతిథ్య పరిశ్రమ అభివృద్ధి, పట్టణ మాస్టర్ ప్లానింగ్ రష్యా యొక్క ఆర్కిటిక్ జోన్ ప్రాంతాలపై చూపే ప్రభావం, పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇచ్చే చర్యలు, పర్యాటక ఉత్పత్తుల సృష్టిలో కొత్త ధోరణులు తదితరు అంశాలు చర్చకి వచ్చాయి. 2021-2023 లో ఆర్కిటిక్ కౌన్సిల్ కి రష్యా అధ్యక్షత వహించడంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని రష్యన్ దూర ప్రాచ్యం ఆర్కిటిక్ అభివృద్ధి మంత్రిత్వ శాఖ, నోరిల్స్క మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ నోరిల్స్క డెవలప్మెంట్ ఏజెన్సీ నిర్వహిం చాయి. ఆర్కిటిక్ కౌన్సిల్ కు రష్యా అధ్యక్షత వహించే కార్యక్రమాలను రోస్ కాంగ్రెస్ ఫౌండేషన్ నిర్వహిస్తుంది. ఆర్కిటిక్ టూరిజం వీక్ వ్యాపార సాంస్కృతిక కార్యక్ర మాలు 2035 వరకు రష్యన్ ఫెడరేషన్ యొక్క ఆర్కిటిక్ జోన్ అభివృద్ధి వ్యూహానికి అనుగుణంగా పర్యాటకంపై దృష్టి సారించాయని, "ఆర్కిటిక్ భూభాగం ఒక ప్రత్యేక చట్టపరమైన పాలనను కలిగి ఉందని ఇది నిరంతరం మెరుగుపరచబడుతోందని అక్కడ అధికారులు చెప్పారు. ఆర్కిటిక్‌కు వచే పెట్టుబడిదారు డికైనా పలు ప్రయోజనాలు అందజేస్తున్నమన్నారు.

గంభీరం రిజర్వాయర్లో ప్రమాదాలు సమస్యను పరిష్కరించండి

విశాలాంధ్ర- ఆనంద పురం: గంభీరం రిజర్వాయర్ ప్రాంతం లో ప్రకృతి ప్రేమికులకు అహ్లాదకరితంగా ఉండెడి ప్రాంతం అక్కడికి పిక్నిక్ ల కోసం పర్యాటకులు చుట్టు పక్కల కాలేజీ స్కూలు నుంచి విద్యార్థులు వచ్చి రిజర్వాయర్ లోతు తెలియక అందులో దిగి గతంలో ఇప్పుడు కలిపి 80 మంది మరణించడం జరిగింది రెవెన్యూ అధికారులు పోలీస్ అధికారులు కు ఆదేశాలు జారీ చేసి తగు చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చేయాలని సర్వ సభ్య సమా వేశం లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం శాసనసభ్యుల ముత్తంశెట్టి శ్రీనివాసరావు కి వినతి పత్రం ఆనందపురం మండలం వైస్ యంపిపి బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ సమర్పించి ఈ సమస్యకు పరిష్కార మార్గం చేయాలని తెలిపారు.

తుమ్మపాలలో ఇంటింటికి కుళాయిలను ప్రారంభించిన మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జల జీవన్ మిషన్ లో భాగంగా కోటి 51 లక్షల రూపాయలతో తుమ్మపాల గ్రామంలో చేపట్టిన ఇంటింటికి కుళాయిలు కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం ప్రారంభించారు. ఈ కుళాయిల ద్వారా నీటి సరఫరా కోసం 200 కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ ను ఇప్పటికే నిర్మించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ చుట్టూ ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ ను మంత్రి అమర్నాథ్ ప్రారంభించి, ఆ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ ను వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు సత్కరించారు.

మతోన్మాద బీజెపిని సాగనంపి.. దేశాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర-దేవరాపల్లి: వామపక్ష ప్రచార భేరిలో భాగంగా గురువారం దేవరపల్లి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం దేవరపల్లి సిపిఐ మండల కార్య దర్శి గరికిన రాజు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్ది దించే సమయం ఆసన్నమైందని ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. రాష్ట్రానికి ఆయువుపట్టు లాంటి విశాఖ ఉక్కును అదానికో జిందాల్ మరో కార్పోరేట్ రాబందులకు కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర చేస్తుంటే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దాసోహం అవుతుందన్నారు. ఇంత ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేని దౌర్భాగ్యస్థితిలో వైకాపా ఉందన్నారు. గంగవరం, కృష్ణపట్నం వంటి కీలకమైన ఓడ రేవులను హైడ్రో విద్యుత్తు ప్రాజెక్టులను సోలార్ విద్యుత్ కొసం ఎంతో విలువైన భూములను సైతం ఆధానికి సమర్పించుకుంటుందన్నారు మోడీ ఆదేశాలకు లొంగి ప్రజలమీద విద్యు త్ స్మార్ట్ మీటర్లను అధిక భారాలను రుద్దుతుందన్నారు. విభజన హామీల అమలు గురించి అడిగే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని,ఇక ప్రజల మీద ఉద్యమాల మీద నిర్బంధ కాండ విషయంలో మోడీ కన్నా తానేమి తక్కువ కాదన్నారు. పోలీసుల చేత అణచివేతలకు పాల్పడుతుందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని ఒక్కమాట అనకుండ వైసీపీకి తీసిపోకుండా ప్రధాన ప్రతిపక్షం టిడిపి వ్యవహరిస్తుందని, అలాగే జనసేన ఏకంగా బిజెపి పంచన చేరిందని ఈ మేధావులు అంతా అధికార దాహంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కె గణేష్,పి.కన్నయ్య, ఎన్.దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పని కూలీలకు న్యాయం చేయాలి

వి.ఆర్.పురం: ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలకు రోజుకి 150 రూపాయలు పడుతుందని వారా నికి 900 రూపాయలు అవుతుందని వికలాంగులకు రోజుకి 80 రూపా యలు పడుతుందని వారానికి 400 రూపాయలు అవుతుందని పని భారం పెరుగుతుందని, సిపిఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారభేరీ నిర్వహించారు. చిన్న మట్టపల్లి గ్రామ పంచాయితీ చింతరేగుపల్లి గ్రామం లో ఈ ప్రచార బేరి భాగంగా ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలను గురువారం సందర్శించడం జరిగింది. ప్రచార బేరి బృందం ముందు కూలీలు తమ సమస్యలను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పనిచేస్తున్న గ్రూపులకు జనరల్ గ్రూప్ కి రోజుకి 150 రూపాయలు కూలి పడుతుందని ఆరు రోజులకి 900 రూపాయలు అవుతుందని పని భారం ఎక్కువ అవుతుందని తక్షణమే పని భారం తగ్గించి రోజుకి రూ.600లు ఇవ్వాలని వికలాంగులకు రోజుకి80 రూపాయలు చొప్పున పడుతుందని ఆరు రోజులకి 400 రూపాయలు అవుతుందని ప్రభుత్వం ఇప్పుడున్న పరిస్థితులను బట్టి రోజుకి 300 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నుండి వికలాంగులకు 50% రాయితీ రావాల్సి ఉందని ఈ ప్రభుత్వం వచ్చాక వికలాంగులకు వచ్చే రాయితీని ఆపేసింది అని వెంటనే రాయితీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు రావాల్సిన అలవెన్స్ మజ్జిగ నీళ్ళు మెడికల్ కిట్లులు టెంట్ ఇవ్వాలనీ గునపం తట్ట పార కు కూలీ ఇవ్వాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలూ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరు కార్చుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లేదని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండ పరిశ్రమల కల్పన లేకుండా పాలన సాగుతుందని ఆరోపించారు యువతకు ఉపాధి ఉద్యోగా అవకాశాలు లేవని కార్మికులకు కష్ట జీవులకు తిండి పెట్టలేని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు లేకుండా సబ్సిడీలపై ప్రోత్సాహకాలు లేని పాలన కొన సాగుతుందని ఆయన విమర్శించారు ప్రభుత్వం ఎంతఅణచివేత దోరణి అవలంబిస్తునా ప్రజల మద్దతుతో ఈ ప్రభుత్వాన్ని గద్దెదించటం ఖాయమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు వద్దాది రమేష్ కుంజా నాగిరెడ్డి కార్యకర్తలు ముత్యాల శివశంకర్ శ్రీరామ్మూర్తి నరసింహారావు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కొండవారి పాలెంలో సీపీఎం ప్రచార భేరి

రాంబిల్లి/యలమంచిలి : రాంబిల్లి మండలంలో కొండవారి పాలెం గ్రామంలో సిపిఎం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించామని మండల కార్యదర్శి జి.దేముడునాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ధరలను అదుపు చెయ్యడంలో గత 9 ఏళ్ళుగా బీజేపీ, నాలుగేళ్ళగా వైసీపీ ఘోరంగా విఫలం చెందాయన్నారు. అనంతరం ఉపాది కూలీలు వీరితో మాట్లాడుతూ ఎండల్లో పనిచేస్తున్నా కనీస సౌకర్యాలు లేవని,గతంలో సమ్మర్ అలవెన్సులు ఇచ్చేవారని కానీ ఇప్పుడు ఇవ్వడం లేదని తెలిపారు. గ్రామంలో త్రాగు నీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, కరెంట్ కోతలుతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారని దేముడునాయుడు అన్నారు. ప్రక్కనే ఎస్ ఈ జెడ్,ఎన్ ఎ ఓ బి వంటి ప్రాజెక్టులు, పరిశ్రమలు ఉన్నా తమకు ఉపాధి కల్పించటం లేదని వారికి తెలిపారన్నారు. ఇటువంటి ప్రభుత్వాలకు రాబోయే కాలంలో తగిన బుద్ధి ఓటు ద్వారా చెప్పాలని, దేముడునాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎరిపిల్లి రాము,ఉపాది కూలీలు ఉన్నారు.

పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకోవాలి : జనసేన



విశాలాంధ్ర-చింతపల్లి : ఈనెల 21న పిడుగు పాటుకు మండలం లోని బెన్నవరం పంచాయతీ పోతురాజు గుమ్మల గ్రామానికి చెందిన వంతల శంబునాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం జన సేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబుతో కలిసి ఆ పార్టీ అరకు పార్లమెంట్ ఇన్చార్జి వంపూ రు గంగులయ్య పోతురాజు గుమ్మల గ్రామాన్ని సందర్శించి పిడుగుపాటుకు గురై మరణించిన సంబు నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. సంబు మృతి బాధాకరమన్నారు. ఆ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలన్నారు. ఏజెన్సీలో ఇటీవల పిడుగుపాటుకు అనేకమంది మృత్యువాత పడడమేకాక మూగజీవులు కూడా మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ లీగల్ అడ్వైజర్ దేపూరు రాజు, సందేశ్, చిట్టిబాబు, నాయక్, సూరిబాబు, అశోక్, హరీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల ఉపయోగాలపై అవగాహన

విశాలాంధ్ర-మాకవరపాలెం: నవధాన్యాలు ఉపయోగాలపై గురువారం మాకవర పాలెం మండలం కొండల అగ్రహారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ రమణ, ఆర్‌బికె విహెచ్ఎ వరలక్ష్మీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, కవిత, గంగరాజు, వరలక్ష్మి, వరహాలమ్మ, సుదర్శన్, అప్పారావు, ఈశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

తప్పు చేస్తే తాటతీస్తా....!

అవినీతిని సహించేది లేదు...

అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ వార్నింగ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఇటీవల జీవీఎంసీ నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన సీఎం సాయి కాంత్ వర్మ జీవీఎంసీలో అందర్నీ హడలెత్తిస్తున్నారు. పాలనపై పట్టు బిగిస్తున్నారు. అన్ని విభాగాలను గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టి అనేకమందిరికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలో ఉన్న సచివాలయాల ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఒప్పుకునేది లేదని, తప్పు చేస్తే తాటతీస్తానంటూ హెచ్చరించడంతో ప్లానింగ్ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు వణికి పోతున్నారు. రెవిన్యూ, ప్లానింగ్, హెల్త్, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు నుండి క్రింద స్థాయి ఉద్యోగుల వరకూ వామ్మో ఈ కమిషనర్ చాలా టాఫ్, తేడా చేస్తే మనల్ని ఇంటి కి పంపిస్తారు అంటూ భయపడి పోతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేయలేకపోవడంతో తీవ్రంగా మండిపడుతున్నారు. నగరంలో అనధికార నిర్మాణాలు ఎక్కడ జరిగిన ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీంతో ప్లానింగ్ అధికారులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇక ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యత, నిర్వహణ లో ఏలాంటి లోపాలను సహించేది లేదని అధికారులకు తేల్చి చెప్పారు. ముక్యంగా నీటి సరఫరా విభాగం లో జరుగుతున్న అవినీతిని, అలసత్వం ను ఊరుకునేది లేదన్నారు. నగర ప్రజలకు త్రాగు నీటి ఎద్దడి లేకుండా నీటి సరఫరా పక్కా జరగాలని ఆదేశించారు. ఇటీవలే మంత్రి సిఫార్సు లతో మళ్లీ నీటి సరఫరా ఎస్ ఈ. గా బాధ్యతలు చేప్పట్టిన ఎస్ ఈ పనితీరు పై కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం చూపా లని, నిబంధనల మేరకు ప్రజ లకు సౌకర్యాలు అందించా లని లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడంతో అధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. మొత్తానికి జీవీఎంసీలో యువ ఐఏఎస్ అధికారి పాలనను గాడిలో పెట్టేందుకు అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. రాజకీయ సిఫార్సులను సైతం లెక్కచేయకుండా, విశాఖ నగర ప్రజలకు పారదర్శకత పాలన అందించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

నిజరూప దర్శనం వైఫల్యాలపై కిందిస్థాయి అధకారులను బలిచేయడం తగునా ?



విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదేవత శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిజరూప దర్శనం వైఫల్యాలను పోస్టుమార్టం చేసి కింది స్థాయి ఉద్యోగులను బలి చేయడానికి జిల్లా జాయింట్ కలెక్టర్ యంత్రాంగం ఎడతెగని కసరత్తుచేస్తోంది. జిల్లా జాయిట్ కలెక్టర్ విశ్వనాథన్ సింహాచలం వచ్చి విచారించిన విషయం తెలిసిందే. అయితే జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో విచారణకు రావాలని దాదాపు 11 మంది దేవాలయాల అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో తొలి విడత 49 మంది గురువారం ఉదయం జయింట్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి విచారణకు హాజర య్యారు. రెండు దశల్లో హాజరుకావాలని ఉన్నతాధికారుల నుండి అందిన ఆదేశాల్లో 112 మంది పేర్లున్నాయి. దేవస్థానం భూముల పరిరక్షణ విభాగాధికారిగా ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ (చందనోత్సవం ప్రత్యేక అధికారి) అజాద్, ఆలయ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలువహిస్తున్న త్రినాథరావు తో మొదలుకొని వాయిద్యకారుల వరకు ఉత్సవ విధుల్లో ఉన్న దేవదాయశాఖ, దేవాల యాల ఉద్యోగులందరూ విచారణ జాబితాలో వున్నారు. చందనోత్సవ వైఫల్యానికి బాధ్యులను చేస్తూ విచారణకు హాజరుకావాలని అధికారులు పంపిన జాబితాలో పేర్లు వందకు ప దాటాయంటూ ఇక్కడితో ఆగుతుందా లేక సంఖ్య పెరుగుతుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. సాక్షాత్తూ దేవదాయశాఖ మంత్రి, కమిషనర్, కలెక్టర్ అక్కడే వున్నారు కదా... మరి వారి బాధ్యత ఏమిటీ? అలా ఇలా విచారణలు జరిపి తుస్సు మన్న ఆశ్చర్య పోవనవసరం లేక పోలేదనే గుసగుసగుసలు వినిపిస్తున్నాయి.

క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలి

విశాలాంధ్ర-కూనవరం: ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న టీబీ కేంద్రాలలో క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.విశ్వేశ్వర నాయుడు తెలిపారు. గురువారం ఆయన కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లోని టీబీ ల్యాబ్ ను పరిశీలించారు. టీబీ కేంద్రాలలోప్రతీ రోజు క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే క్షయ రోగులకు కావలసి మందులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు.రోగులు రెగ్యులర్‌గా మందులు వాడుతున్నారా లేదా అనే సమాచారం వైద్య సిబ్బంది తో పాటు టీబీ సూపర్ వైజర్లు తెలుసుకొని రిపోర్ట్ చేయాలని అన్నారు. టీబీ రోగులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. టీబీ రోగుల సమాచారం ఆన్లైన్ లో నమోదు చేయడంతో పాటు జిల్లా అధికారులకు కూడా ప్రతీ రోజు సమాచారం పంపించాలని తెలియజేసారు. అనంతరం టీబీ వార్డులోని రికార్డులు పరిశీలించడంతో పాటు ఇక్కడ చేస్తున్న పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ హెచ్ వో కంసెల్టెంట్ డా. విగ్నేష్ , వైజాగ్ డిటీసీ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ వో డా. పి. పుల్లయ్య, హెడ్‌నర్స్ బి.బొజ్జి, టీబీ సూపర్ వైజర్లు రవ్వా రామాంజ నేయులు, చిచ్చడి భారతి , టీబీ లాబ్ టెక్నీషియన్ కాకా సుబ్బారావు , ఎల్ టీలు సోమన్న దొర , దేవిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పథకానికి సిపిహెచ్ పాఠశాల ఎంపిక

విశాలాంధ్ర-కొయ్యూరు: మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-1 పిఎంశ్రీ పథకానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వివి మూర్తి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకానికి పాఠశాల ఎంపిక అవడంతో విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ పథకం ద్వారా విద్యార్థులకు వివిధ వృత్తి విద్యా కోర్సులు వివిధ రకాల గేమ్స్ కు శిక్షణ ఇవ్వడంతోపాటు వివిధ ప్రయోగశాలలో విద్యార్థులకు అందుబాటులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకానికి పాఠశాల ఎంపికవడంతో 2023 24 విద్యా సంవత్సరానికి అన్ని తరగతులలో సీట్ల భర్తీకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు మూడో తరగతిలో 80 సీట్లు నాలుగవ తరగతిలో 60 ఐదవ తరగతిలో 60 40 ఏడవ తరగతి 25 8వ తరగతి 40 సీట్ల భర్తీకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తరగతులలో ప్రవేశాల ప్రక్రియ మే 1 నుండి ప్రారంభం అవుతుందని కావున విద్యార్థుల తల్లిదండ్రులు త్వరపడి పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని హెచ్ఎం మూర్తి, హెచ్డబ్ల్యూఓ మోహన్ రావు లు కోరారు.

ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య



విశాలాంధ్ర-మల్కాపురం: ఇంటర్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువు తున్న విద్యార్థిని ఆత్మకూరు అఖిలశ్రీ(16) పరీక్ష తప్పిందని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధి త్రినాధపురం లో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. మల్కాపురం సిఐ బి.లూథరబాబు వివరాల ప్రకారం.. జీవీఎంసీ 62వార్డు త్రినాధపురం లో కుటుంబంతో నివాసముంటున్న ఆత్మకూరు అఖిలశ్రీ గాజువాకలోని గాయత్రీ కళాశాలలో ఇంటర్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతుంది. అయితే బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో ఫెయిల్ అవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో మధ్యాహ్నం 12గం లకు ఫ్యాన్ హుక్ కి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం మేరకు మల్కాపురం సిఐ లూథర్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం కె జి హెచ్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్రాక్ష హరి విజయ్ మృతి విడిన మిస్టరీ

ఆర్థిక లావాదేవీలు కారణంగా భార్య పథకం ప్రకారమే హత్య

నిందితులు అరెస్టు చేసిన పోలీసులు



విశాలాంధ్ర-పాడేరు: ఈ నెల 18న చోడవరం నివాసం ఉంటున్న లొంజా ఉద్రాక్ష హరి విజయ్ ను అనారోగ్యంతో చోడవరం నుంచి పాడేరు తీసుకువస్తుండగా పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆసుపత్రిలో ఉద్రాక్ష హరి విజయ్ వైద్య సేవలు నిమిత్తం జాయినింగ్ చేస్తే మృతి చెందినట్లు మృతుని భార్య ప్రీతి పాడేరు పోలీసులకు తెలిపారు. దీనిపై పాడేరు పోలీసులు అనుమానస్పదా మృతి కేసుగా నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ముంచంగిపుట్టు మండలం దారేలా పంచాయతీ, చీవుకు చింత గ్రామానికి చెందిన నమారెడ్డి ప్రీతిని, జి. మాడుగుల మండలం,నేరోడి వలస గ్రామానికి చెందిన లొంజా ఉద్రాక్ష హరి విజయ్ ను ప్రేమించి 2014లో పెళ్లి చేసుకుంది. వారి దాంపత్య జీవితానికి ఒక పాపా కలదు. ప్రీతి తన భర్తతో, తన తండ్రితో కలసి అనకాపల్లి జిల్లా, చోడవరం మండల కేంద్రంలోని మారుతి నగర్ లో నివాసం వుంటున్నారు. ఈ మధ్య కాలంలో ప్రీతి భర్త ఉద్రాక్ష మధ్యన ప్రతి దినం పైనాన్స్ వ్యాపారం మధ్యన తరుచు గొడవలు జరుగుతు వస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 18న ప్రీతి తన భర్త ఉద్రాక్ష అనారోగ్యం వలన పాడేరు జిల్లా ఆసుపత్రికి తీసుకువస్తే మరణించినట్లు తెలిపిందాన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసును నమోదు చేసి లోతుగా విచారణ చేశారు. ఫోన్ కాల్ డేటా, మరియు పోస్టు మార్టం నివేదిక ఆధారంగా ఉద్రాక్ష హరి విజయ్ ను తన భార్య అయినా ప్రీతి, తన తండ్రి అయినా శంకర్ రావుతో మరి కొంతమంది వ్యక్తులు కలసి హత్య చేసి,ఎవ్వరికి అనుమానం రాకుండా ఉండేందుకు సాధారణ మరణం కిందా చిత్రిక్షరించేందుకు ప్రయత్నం చేశారాన్నారు. హత్యకు పాల్పడిన నిందితుడైనా శంకర్ రావు ను అరెస్టు చేశామాన్నారు. జిల్లా ఎస్పీ తుహిమ్ సిన్హా ఆదేశాలమేరకు కేసును చోడవరం పోలీసులకు బదిలీ చేసినట్లు పాడేరు సీఐ సుధాకర్, ఎస్ ఐ లక్షణ్ రావు తెలిపారు.

రిషి కళాశాల విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ఉమాశంకర్

విశాలాంధ్ర-నర్సీపట్నం: ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక నర్సీపట్నం రిషి జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినం దుకుగాను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ గురువారం అభినందించారు. ఇటీవల విడుదల అయిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కనపరిచి అత్యధిక మార్కులు సాధించిన బి.సాయి సాత్విక (ఎంపీసీ)463, బి.లక్ష్మి దుర్గ (ఎంపీసీ)463 మార్కులు, 457 మార్కులను పైబడి సాధించిన విద్యార్థులు 10 మంది అలాగే ద్వితీయ సంవత్సరం లో ఎల్.లత శ్రీ (బైపీసీ)981,రేష్మ (బైపీసీ)980 తదితర విద్యార్థులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు ఎమ్మెల్యే గణేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో రిషి కళాశాల కరస్పాండెంట్ కోన సతీష్ , డైరెక్టర్ ఆర్‌వై నాయుడు మరియు అధ్యాపకబృందం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-కొయ్యూరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెదేపా బలపరిచిన అభ్యర్థి గెలుపుకు కారణమైన ఉపాధ్యాయులకు తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి స్వయంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన ఈశ్వరి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెదేపా బలపరిచిన అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు కు మద్దతిస్తూ భారీ మెజార్టీతో గెలిపించిన ఉపాధ్యాయులకు స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. తనపై పార్టీపై నమ్మకంతో మద్దతిచ్చిన ఉపాధ్యాయులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఈశ్వరి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరివెంట తెదేపా మండల ప్రధాన కార్యదర్శి దొరబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి మాజీ ఎంపీటీసీ శివరామరాజు ఐటీడీపీ ఇన్చార్జి కురుజు శ్రీను పాడేరు నియోజకవర్గ మహిళా కార్యదర్శి రత్నం మండల మహిళా నాయకురాలు కె.వరలక్ష్మి పార్టీ మండల కార్యదర్శి బంటు లక్ష్మణ్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సన్యాసిరావు తదితర పలువురు పాల్గొన్నారు.

బడి బయట బాలికలను కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో చేర్పింపు

విశాలాంధ్ర-అనంతగిరి: బడి బయట బాలికలను గుర్తించి కస్తూర్బా గాంధీ విద్యాలయా లలో చేర్పిస్తున్నామని ఆ విద్యాలయాల అల్లూరి జిల్లా జిసిడివో సూర్య కుమారి అన్నారు. అనంతగిరి మండలం కొత్తూరు కేజీబీవీ విద్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయం ఇంచార్జి ప్రిన్సిపాల్ కె.లత ను విద్యాలయం స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అదే క్రమంలో బడి బయట ఉన్న విద్యార్థి దశ బాలికలను గుర్తించి పాఠశాలలో చేర్పించుకోవాలని ఉపద్యాయుని లకు ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె కొత్తూరు గ్రామస్థులతో మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ విద్యాలయలలో సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. బడి బయట ఉన్న విద్యార్థి దశ బాలికలను, చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించాలని ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ లత తో పాటు ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. ఏ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ లత, సిబ్బంది ప్రమిలా, భారతి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మే 3న జికెవీధి మండల ఆదివాసీ జెఎసి మండల కమిటీ సమావేశం

విశాలాంధ్ర - జికెవీధి; మే3న ఆదివాసి జెఏసి జికె వీధి మండల కమిటీ సమా వేశం జరుగుతుం దని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొర్ర బలరాం,రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి రీమెల పాలు, జిల్లా ప్రతినిధులు గొర్లె యేసువరరాజు, కొర్ర నీలకంఠంలతోకలిసి విలేఖర్లతో మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతి ఒరియా కులాలను గిరిజన జాబితాలో కలపాలని అసెంబ్లీ చేసిన తీర్మాణానికి వ్యతిరేఖంగా పోరాటం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి పూనుకుందని, దానిలో భాగంగా క్షేత్రస్థాయిలో ఆదివాసీలను ఐక్యం చేయాలని, తమ హక్కులు, చట్టాలు కాపాడుకోవడానికి, ప్రభుత్వాలు ఆదివాసీలకు చేస్తున్న దురాగతాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడానికి ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసీ జెఏసి ఏర్పడిందన్నారు. ఈ నెల 16న విశాఖలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి రాష్ట్ర చైర్మన్‌గా విశ్రాంతి ఐఎఎస్ అధికారి డా.తమర్బ బాబురావు నాయుడుతో పాటు రాష్ట్ర కార్యవర్గం ఏర్పడగా, 28న అల్లూరి సీతారామరాజు జిల్లా, 29న మన్యం పార్వతీపురం జిల్లా, 30న శ్రీకాకుళం జిల్లా కార్యవర్గాల ఎన్నిక ఎంపిక జరుగుతుందని, మే 1నుండి మండలాల కార్యవర్గాలు ఎంపిక జరుగుతుందని, మే 5, 6, 7 తారీఖులలో ఉభయ గోదావరి జిల్లాల (రంపచోడవరం, చింతూరు, పోలవరం) కార్యవర్గాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఆ తర్వాత పంచాయితీ, గ్రామ స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉదృతం చేయాలని సంకల్పించామని, ఆదివాసీలంతా సహకరించాలని ఆయన కోరారు..

భీమిలి నియోజకవర్గంలో బిజేపిదే కీలక పాత్ర

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి నియోజకవర్గం బిజెపి పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గం కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన గుంటూరు లో జరిగిన పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశంలో నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే విదంగా దిశా నిర్దేశం చేసారన్నారు. అందులో బాగంగా నియోజకవర్గంలో వున్న 335 పోలింగ్ బూత్ లలో ప్రతీ పోలింగ్ బూత్ లో 11 మందితో బూత్ కమిటీలు మొత్తంగా 3700 మందితో వేయబోతున్నామన్నారు. అలాగే ప్రధాని గారి మనసులో మాట (మన్ కి బాత్) 100వ ఎపిసోడ్ ను నియోజకవర్గంలో వున్న 80 శక్తి కేంద్రాలలో ఎక్కువ మంది వీక్షించేలా చేస్తున్నామన్నారు. అలాగే మే 5వ తేదీ నుండి అభివృద్ధి నిరోధక, ప్రజావ్యతిరేక, అవినీతి పాలన చేస్తున్న వైకాపా ప్రభుత్వం పై చార్జ్ షీట్ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో చేస్తున్నాన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమం కోసం పార్టీ 11 మంది రాష్ట్ర పార్టీ పెద్దలతో కమిటీ వేసిందన్నారు. అలాగే ఈ నెల 29వ తేదీన సాయంత్రం 5 గంటలకు కాశీలో లో జరిగే "కాశీ తెలుగు సంగమం - గంగా పుష్కర అరాధన" ను ప్రధాని మోదీ గారు ప్రసంగించనున్నారు. అలాగే మన్ కి బాత్ 100 వ ఎపిసోడ్ గురుంచి కేంద్రప్రభుత్వం పోస్తల్ స్టాంప్ ను, ప్రత్యేక నాణేన్ని విడుదల చేసిందన్నారు.

గంజాయి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

జికెవీధి సిఐ అశోక్‌కుమార్

విశాలాంధ్ర-జికెవీధి : గంజాయి సాగుకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని జికెవీధి సిఐ అశోక్‌కుమార్, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మహిళా పోలీసులు, ఫీల్డ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టికల్చర్ ఆఫీసర్లు, సెక్రటరీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గంజాయి పండించే రైతులకు ప్రత్యామ్నాయంగా హార్టికల్చర్ ద్వారా ఆదాయాన్ని సమకూర్చే మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కావున గంజాయి సాగు చేసే రైతుల యొక్క వివరాలను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఒ మధుసూధనరావు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ఉషోదయ విద్యార్థులు

విశాలాంధ్ర-చోడవరం : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో చోడవరానికి చెందిన ఉషోదయ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ జెర్రిపోతుల రమణాజి గురువారం మీడియా కు తెలియజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు గాను 900 మార్కులకు పైగా 28 విద్యార్థులు సాధించారని తెలిపారు. వారిలో 988 మార్కులు సాధించి, అనకాపల్లి జిల్లాలో ప్రథమ స్థానంలో డి.లీలా నిలువగా, డి.మానస కు 987, ఎస్.కె.అమిత భాను 985, పి.కుమారి 935 మార్కులు సాదించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 49 మంది విద్యార్థులు 400 మార్కులకు పైగా సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ జె.కృష్ణకుమారి, డీన్ ఎస్వీ వాసు, ప్రిన్సిపాల్ వి.ఎస్.ఎస్.అప్పారావు, అధ్యాపకులు, తల్లితండ్రులు తదితరులు అభినందించారు.

మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించండి

బూత్ లెవెల్ అధికారులకు తహసీల్దార్ ప్రసాద్ సూచన

విశాలాంధ్ర-చింతపల్లి: మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లాలం సీతయ్యతో కలసి మండల కేంద్రంలోని బూత్ లెవెల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 లో జరగబోవు సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. పీవీటి జిల వాటర్ల జాబితాను సిద్ధం చేయడంతో పాటు, మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి గరుడ యాప్ ద్వారా తొలగించే ప్రక్రియను చేపట్టాలన్నారు. ఫారం 6.6బీ, ఫారం 8.8సీ డేటా పూర్తిగా సేకరించి జాబితా సిద్ధం చేయాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు తమ అభ్యంతరాలను తెలియపరచడంతో పాటు పోలింగ్ బూతుల ఏర్పాటులో మార్పులు, చేర్పులపై తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు.

తగరంపూడి పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కారం : ఎంపిపి సూరిబాబు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై, కార్యవర్గ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది, సర్పంచ్, ఎంపీటీసీలతో చర్చించారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పలు సమస్యలపై సలహాలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఆస్పత్రి ఆవరణలో లోతుగా ఉండడం వలన వర్షం పడేటప్పుడు వర్షపు నీరు నిలువ ఉండిపోతుంది అని మట్టి ఫిల్లింగ్ చేసి ఎత్తు చేయాలని, ఆపరేషన్ థియేటర్, ఆసుపత్రి మొత్తం చెదల నివారణ కోసం పేస్టు కంట్రోల్ చేయాలని, దోమలు రాకుండా కిటికీలుకి మెస్సలు ఏర్పాటు చేయాలని అలాగే పేషెంట్స్ ఉండే రూమ్ కి ఎయిర్ కండిషనర్ పెట్టించలని తదితర సమస్యల పరిష్కారం చెయ్యాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వార్డులో ఉన్న పేషెంట్స్‌ని ఆస్పత్రిలో సేవలు ఎలా అందుతు న్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే ధర్మారావు, డాక్టర్ రమేష్ నాయుడు, తగరంపూడి సర్పంచ్ యాదిగిరి అప్పారావు సీతానగరం సర్పంచ్ సుంకర చంటిబాబు, ఆంధ్ర ప్రదేశ్ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జంపన శివాజీ వర్మ , బోర్డు మెంబర్లు, వైసిపి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కూండ్రం అంగన్వాడిని సందర్శించిన ఎంపిపి సూరిబాబు

అనకాపల్లి మండలంలో గల కూండ్రం సచివాలయ పరిధిలోగల కొత్తూరు సెక్టార్ సంబంధించి కూండ్రం-1 అంగన్వాడి సెంటర్ ను అనకాపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో అంగన్వాడి వర్కర్ మెనూ పాటించకుండా వంట చేసి ఉన్నదని, అలాగే గర్భిణీ, బాలింతలకు సంబంధించి హాజరు పట్టికలో నాలుగు రోజులుగా హజరు నమోదు చేయకుండా ఉన్న కారణంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అంగన్వాడి పీఓ ను ఆదేశించారు. ఇలాంటి పొరపాట్లు మళ్ళీ జరగకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే ధర్మారావు, ఏసీడిపిఓ శశికళ, కూండ్రం వైఎస్ఆర్సిపి నాయకులు సేనాపతి పెంటారావు, యలమంచిలి చిన రమణ, కనుబుడ్డి శంకరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే అభివృద్ధి ...

విశాలాంధ్ర-హుకుంపేట: శివారు గ్రామల సైతం జగనన్న పాలనలోనే అభివృద్ధి జరుగుతుందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మం డలంలోని రాప పంచాయితీ ఈదు లగరువు,ఇరుకురాయి, కే.తాడిపు ట్టు, రీడేబంద గ్రామల్లో ఆయన పర్యటించారు. ఆయ గ్రామల్లో పూల మాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈనేపథ్యంలో 165 గడప లకు వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామల్లో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈదులగరువులో వంతెన,ఇరుకురాయిలో సీసీ రోడ్లు మంచి నీరు సౌకర్యం కల్పించాలని గిరిజనులు విన్నవించారు. ఎమ్మెల్యే స్పందించి కొద్ది రోజులోనే ఈసమ స్యలను పరిష్కారిస్తావని హామి ఇచ్చారు. అన్ని గ్రామల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ కలిగి పని చేస్తోందని అన్నారు. తమ గ్రామల్లో కొద్ది రోజుల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కూడా రాజుబాబు,జడ్పిటీసీ రేగం మత్యలింగం, స్థానిక సర్పంచ్ కొప్పుల దేవుడమ్మ, ఎంపిటీసీ సభ్యురాలు కోరాబు నాగలక్ష్మి మండల వైసిపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మే11న చలో కలెక్టరేట్ ముట్టడి ...

గిరిజన సంఘం పిలుపు

విశాలాంధ్ర-అరకులోయ: సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ గిరిజన సంఘం కార్యాలయంలో గురువారం సమావేశ నిర్వహించారు.ఈ సమావేశానికి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర, ఆదివాసి అధిరార్ రాష్ట్రీయ ప్రతినిధి అప్పల నరస హాజరయ్యారు.ఈ సమావేశంలో ప్రతి పంచాయతీలో ఉన్న ప్రజా ప్రతినిధులను నిలదీత కొనసాగించాలని,బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని,కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం చేపట్టాలని గిరిజన సంఘం జిల్లా కమిటీ నిర్ణయించింది. అలాగే కిలో చింతపండు జిసిసి 60 రూపాయలు కొనుగోలు చేయాలని తీర్మానించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అసెంబ్లీలో తీర్మానించిందని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం మంత్రి జగన్మోహన్ రెడ్డిఅదే తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టిందని అయితే గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రజాప్రతినిధులు కనీసం ఏ ఒక్కరు కూడాను మన గిరిజన గోడును మన గిరిజన ప్రజల యొక్క మనోభావాలు కోసం ప్రస్తావన చేయక పోవడం విచారకరమన్నారు.ఒకవైపు ఎస్టీ కమిషన్ లో చర్చ జరగకపోవడం,ట్రైబల్ అడ్వైజర్ కమిటీ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరచాలనే విషయం కనీసం చర్చ జరగకుండా నేరుగా అసెంబ్లీలో తీర్మానం చేయటం మన రాష్ట్రంలో ఉన్న 38 లక్షల మంది గిరిజన ప్రజానీకాన్ని అవమానించినట్టేనని వారు తెలిపారు.దీనికి నిరసిస్తూ వచ్చే నెల మే11న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని గిరిజన సంఘం చేపడుతుందని ఈ పిలుపును గిరిజన ప్రజానికం జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు గిట్టుబాటు ధర లేదని తక్షణమే జిసిసి ద్వారా కిలో చింతపండుకు 60 రూపాయలు కొనుగోలు చేయాలని జిల్లా కమిటీలో నిర్ణయం చేయడం జరిగిందన్నారు. జిసిసి చింతపండు కిలో 60 రూపాయలు కొనుగోలు చేయాలని వచ్చేవారం ప్రతి మండలంలో జిసిసి మేనేజర్లకు విన్నత పత్రం అందజేయాలని జిల్లా కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎంఎం శ్రీను,ఎస్ చిరంజీవి,నర్సయ్య, పాంగి రామన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు 2, 3, 4, జోన్లలో తాగునీటికి అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 2,3,4 జోన్లలో నేడు తాగునీరుకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ నరవ వద్ద గోదావరి ప్రధాన పైపులైను గురువారం న పగులుటవలన మరమ్మత్తులు చేయు నిమిత్తం శుక్రవారం తాగునీటికి దిగువన తెలపబడిన ప్రాంతాలలో అంతరాయం ఏర్పడుతుం దన్నారు. రెండవ జోన్ కు సంబంధించి మధురవాడ, పీఎం పాలెం, ఆరిలోవ సెక్టర్ 1 నుండి 12 వరకు, చిన్నగదిలి, పెద్దగదిలి, విశాలాక్షి నగర్, మూడవ జోన్ లో చిన్న వాల్తేరు, పెద్ద వాల్తేరు, పాండురంగాపురం, రేసవానిపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీ పాలెం, మద్దిలపాలెం, చైతన్య నగర్, వినాయక నగర్, మంగపురం కాలనీ, జాలారిపేట, ఆదర్శనగర్, వాసవానిపాలెం, ఎంపీ సెక్టార్-1 నుండి 12 వరకు, సీతంపేట, అక్కయ్యపాలెం, లలితానగర్, ఎన్జీవోఎస్ కాలనీ, శ్రీనివాస నగర్, నందగిరినగర్, నరసింహనగర్, గణేష్ నగర్, నక్కవానిపాలెం, క్రాంతి నగర్, గాంధీనగర్, సింహాద్రిపురం, లక్ష్మీ నరసింహ నగర్, పాత వెంకోజిపాలెం, దుర్గానగర్, నాల్గవ జోన్ లో వేలంపేట, టౌన్ కొత్త రోడ్డు, రంగిరీజు వీధి, మంతావారివీధి, సున్నపువీధి, రెల్లి వీధి, జబ్బర్ తోట, చిలకపేట, అల్లిపురం ప్రధాన రహదారి, నేరెళ్ల కోనేరు రోడ్డు, అమ్మవారి వీధి, కుమ్మరి వీధి, కొబ్బరి తోట, నేతాజీ నగర్, అంబేద్కర్ కాలనీ, జండా చెట్టు, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, దండు బజారు, జాలారిపేట, సాలిపేట, కేజీహెచ్, డాబా గార్డెన్ , జగదాంబ నీలమ్మ వీధి తదితర ప్రాంతాలతో పాటూ మరికొన్ని ఇతర ప్రాంతాల్లో కూడా ముఖ్యంగా ఐదవ జోన్లో రైల్వే న్యూ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నరేంద్ర నగర్, తాటి చెట్ల పాలెం, సింగలమ్మపురం, సింహగిరి కాలనీ, కైలాస పురం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కంచరపాలెం, రామ్మూర్తి పంతులుపేట, సుభాష్ నగర్, సిద్ధార్థ నగర్, మహారాణి వీధి, మర్రిపాలెం, కరాస, గౌరీ నగర్, మురళి నగర్ తదితర ప్రాంతాలలో తాగునీరుకి అంతరాయం ఏర్పడుతుందన్నారు. పైన తెలపబడిన ప్రాంతాల ప్రజలకు తాగునీరు అంతరాయానికి చింతిస్తున్నామని, కావున తాగునీరు అంతరాయం ఏర్పడిన దృశ్య జీవీఎంసీ కి సహకరించవలసినదిగా మంచినీటి సరఫరా విభాగం అధికారులు కోరడమైనదని తెలిపారు.